

విప్లవ వీరుడా.. ఇక సెలవు..!
అడవిలో రక్తపు సింధూరమై 30 ఏళ్ల తరువాత స్వగ్రామానికి తిరిగి వచ్చిన అడెల్లు మృతదేహం ఎర్రని వర్ణపు తాకిడికి తడిసి ముద్దయింది. 8లో▸



కావాలి అగ్రికల్చర్ పాలిటెక్నిక్
ముధోల్‌లో 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రం రైతులకు విలువైన సేవలు అందిస్తోంది. దానిని అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌గా మార్చాలని కోరుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
40.1 /28.4

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

పునఃప్రారంభానికి సిద్ధం

• డీఈవో రామారావు



లక్ష్మణచాంద: మరో రెండు రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్నాయి. కొత్త విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేశామని డీఈవో తెలిపారు. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై జిల్లా విద్యాధికారి పి.రామారావుతో ఇంటర్వ్యూ.

సాక్షి: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయా?

డీఈవో: జిల్లాలో మొత్తం 787 ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభానికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

సాక్షి: పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు మొదలయ్యాయా, ఎలా చేయిస్తున్నారు?

డీఈవో: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సూచనల మేరకు ఇప్పటికే పాఠశాలలో పారిశుద్ధ్య పనులు ప్రారంభం అయ్యాయి. గ్రామపంచాయతీ సిబ్బందితో పనులు చేయించాం. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేయడంతో పాఠశాలలో పారిశుద్ధ్య పనులు చకచకా పూర్తి చేస్తున్నారు.

సాక్షి: శిథిలావస్థకు చేరిన పాఠశాలలో ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలను తొలగించడానికి ఎంపీడీవో, ఎంఈవో, ఇంజినీరింగ్ సిబ్బందికి తగిన మార్గదర్శకాలు జారీ చేశాం. ఈ విషయమై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో దగ్గరుండి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. శిథిలావస్థకు చేరిన పాఠశాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించాం.

సాక్షి: విద్యార్థుల సంఖ్య పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట. ఇందులో భాగంగా ప్రతీ పాఠశాల ఉపాధ్యాయులు వారి పరిధిలోని గ్రామాల్లో 6–14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి వారికి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను తెలియజేస్తూ తమ పిల్లలను చేర్పించేలాగా అవగాహన కల్పించాలని సూచించాం. అదేవిధంగా పాఠశాలలోని గత విద్యార్థులు సాధించిన పురోగతిని తెలియజేస్తూ పిల్లల సంఖ్యను పెంచడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బాధ్యతతో విద్యార్థుల నమోదు పెంచేలాగా ఎంఈవోల ద్వారా ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

సాక్షి: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో చేపడుతున్న పాఠశాలల పనులు పూర్తయ్యాయా?

డీఈవో: జిల్లా వ్యాప్తంగా 628 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టడం జరిగింది. ఇందులో ఇదివరకే 590 పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాయి. మిగిలిన 38 పాఠశాలల్లో చివరి దశలో ఉన్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అవి కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయా?

డీఈవో: పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి వసతిని, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది. ఏమైనా మరమ్మతులు ఉంటే వేసవిలోనే పూర్తి చేయాలని సూచించడం జరిగింది. అన్ని పాఠశాలలో ప్రారంభం నాటికి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేలాగా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారా.. ఎంత మందిని సర్దుబాటు చేశారు.

డీఈవో: కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంది. అటువంటి పాఠశాలలో ప్రస్తుతం సర్దుబాటు ప్రక్రియ జరుగుతోంది. పాఠశాలల ప్రారంభం నాటికి ప్రక్రియ పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

సాక్షి: విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు ప్రారంభంరోజు అందిస్తారా?

డీఈవో: జిల్లాలో మొత్తం విద్యార్థులకు పార్ట్ 1 పుస్తకాలు 3,40,220 అవసరం కాక ఇదివరకే అన్ని ఎంఈవో కార్యాలయాలకు సరఫరా చేశాం. అక్కడ నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

సాక్షి: మొదటి రోజే యూనిఫామ్ అందిస్తారా?

డీఈవో: జిల్లాలో మొత్తం 48,874 మంది విద్యార్థులకు ఒక జత చొప్పున యూనిఫాం స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలతో కుట్టించాం. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళల వద్దకు వెళ్లి ఒక జత యూనిఫామ్ తీసుకోవడం జరుగుతుంది. పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేస్తాం.

టీచర్ల సర్దుబాటుకు బ్రేక్!

• ఇప్పటికే విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటుకు నిర్ణయం
• జూలై 15 నాటికి తాత్కాలిక వర్క్ అడ్జస్టిమెంట్లు
• కలెక్టర్‌కు పూర్తి అధికారాలిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు

ఉపాధ్యాయుల కేటాయింపు ఇలా..

విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయులు
10 మందిలోపు	ఒకరు
60 మందిలోపు	ఇద్దరు
90 మంది లోపు	ముగ్గురు
120 మంద లోపు	నలుగురు
150 మంది లోపు	ఐదుగురు
200 మంది లోపు	ఆరుగురు
220 మంది వరకు	ప్రతీ సబ్జెక్టుకు ఒకరు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ మొదట జూన్ 13లోపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను తాత్కాలిక వర్క్ అడ్జస్టిమెంట్ పేరిట సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. అయితే, ఈ నిర్ణయాన్ని నెల రోజులు వాయిదా వేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 15 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ ప్రక్రియకు కలెక్టర్‌కు పూర్తి నిర్ణయాధికారం అప్పగించింది. జిల్లాలో సుమారు 735 పాఠశాలలు ఉండగా, ఇవి జూన్ 12 నుంచి నూతన విద్యా సంవత్సరం కోసం పునఃప్రారంభం కానున్నాయి. జూన్ 13లోపు సర్దుబాటు చేస్తే విద్యార్థుల సంఖ్యలో స్పష్టత ఉండదని ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు విద్యాశాఖ ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నర్సింహారెడ్డి సోమవారం ఈ ఉత్తర్వులను విడుదల చేశారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే బాధ్యతను కలెక్టర్‌కు అప్పగించారు. ఈ సర్దుబాటు తాత్కాలిక వర్క్ అడ్జస్టిమెంట్ పేరిట విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు కొనసాగుతుంది. ఒక పంచాయతీ పరిధిలో అదనపు ఉపాధ్యాయులను ముందుగా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో, ఆ తర్వాత మండల, సమీప మండల, ఆపై జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలని నిబంధనలు పేర్కొన్నాయి.

జిల్లాలో పాఠశాలల వివరాలు

నిర్మల్ జిల్లాలో 19 మండలాలు, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీల పరిధిలో మొత్తం 735 ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 2,500 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు దాదాపు 500 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలు..

ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచేందుకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో తల్లిదండ్రులను కలిసి ప్రచారం చేశారు. జూన్ 6 నుంచి 19 వరకు 'బడిబాట' కార్యక్రమం చేపట్టారు. అయితే, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్న నిబంధనలపై ఉపాధ్యాయ సంఘాలు పునరాలోచన చేయాలని కోరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తామని, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తామని ప్రకటించింది. కానీ, ప్రస్తుత నిర్ణయం ద్వారా పాఠశాలలు నిర్వీర్యం కావచ్చని, తల్లిదండ్రులలో విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: బాల కార్మికు వ్యవస్థ నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.రాధిక అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్త్రీ, శిశు, వయోజనులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, బాల కార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాధిక ప్రత్యేక అతిథిగా హాజరై బాల కార్మిక చట్టం ముఖ్యాంశాలను వివరించారు. పిల్లల హక్కులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి, ఎస్సై సందీప్, బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్ లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ గంగాధర్, మిషన్‌శక్తి కోఆర్డినేటర్ సబిత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జి.రాధిక

నిర్మల్ నుంచి రామేశ్వరానికి బస్సు

నిర్మల్‌టౌన్: నిర్మల్ నుంచి రామేశ్వరానికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పండరి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు రామేశ్వరానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో అరుణాచలం గిరి ప్రదక్షిణ దర్శనం చేసుకుని నిర్మల్ చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే 36 మంది ప్రయాణికులు ఉంటే ఎక్కడికైనా బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రయాణపు తేదీ, చార్జీ వివరాలకు 9959226003, 8328021517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలి

• మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యతతో కూడుకున్న విషయమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశుసంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, ప్రభుత్వ పెట్రోలు బంకులు ఏర్పాటు చేయాలని, అక్టోబర్ 2 నాటికి ప్రారంభించేందుకు అవసరమైన స్థలాలను కలెక్టర్లు గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిర మహిళా శక్తి భవనాల పనులను నవంబర్‌లోపు పూర్తిచేయాలన్నారు. అంగన్‌వాడీలు జూన్ 11న పునఃప్రారంభం కావడంతో చిన్నారులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని, 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. కొత్తగా అంగన్‌వాడీలు నిర్మించేందుకు స్థలాల ఎంపిక చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభరోజునే యూనిఫాం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే 90 శాతం యూనిఫాంల స్టిచింగ్ పూర్తయ్యిందన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం అమలుతో జిల్లాలో ఇప్పటి వరకు 1,460 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరారని పాఠశాలల ప్రారంభంరోజే 48,874 మంది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం పనులు అనంతపేట సమీపంలో వేగంగా సాగుతున్నాయని తెలిపారు. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు చేసేందుకు సంబంధిత కార్యాచరణ మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. ఎస్టీ మహిళలు, మారుమూల ప్రాంత మహిళలు స్వయం సహాయక బృందాల్లో తక్కువగా ఉన్న నేపథ్యంలో కొత్త సభ్యుల చేర్పు కోసం గ్రామ పంచాయతీస్థాయిలో సమీక్ష జరుపుతున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో పి.రామారావు, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్

న్యూస్‌రీల్

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



బ్యాడ్మింటన్ లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న మంచిర్యాల్‌లో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో నిర్మల్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్–11 సింగిల్స్‌లో అర్జున్ 2వ స్థానంలో, డబుల్స్‌లో అర్జున్, అమన్ మొదటి స్థానంలో నిలిచారు. అండర్–11 బాలికల డబుల్స్ విభాగంలో శ్రీకతి, హర్షిత రెండోస్థానంలో నిలిచారు. అండర్–13 సింగిల్స్‌లో శ్రీహర్షిత్ మొదటి స్థానంలో నిలిచాడు. అండర్– 15 మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆరాధ్య, శ్రీహర్షిత్ రెండోస్థానం సాధించారు. అండర్ –15 బాలికల డబుల్స్‌లో ప్రతిభ, సహర్షి రెండో స్థానంలో నిలిచారు. ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, వన్నెల భూమన్న, సందీప్, ప్రశాంత్, మాణిక్యం, భారత్, శ్రీనివాస్, ముత్యం విద్యార్థులను అభినందించారు.

పరిహారం కోసం పోరుబాట

• పాత గ్రామాల్లో గుడిసెలు వేసి, వంటవార్పు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తులు పరిహారం కోసం పోరుబాట పట్టారు. గ్రామాలను ఖాళీ చేసి ఏడాది గడిచినా పరిహారం అందలేదని సోమవారం రాంపూర్, మైసంపేట్ పాత గ్రామాల్లో గుడిసెలు వేసి, అక్కడే వంట వార్పు చేశారు. పునరావాస గ్రామాల్లో సాగు భూములను చదునుచేయించడం, పట్టాలు, విద్యుత్, సాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. లేదంటే పాత గ్రామాల్లోనే వ్యవసాయం చేసుకుంటామన్నారు. ఉడుంపూర్ ఎఫ్‌ఆర్వో అనిత పునరావాస గ్రామస్తులతో మాట్లాడి డీఎఫ్‌వోకు పరిస్థితిని తెలియజేశారు.

కొత్త మంత్రులను కలిసిన డీసీసీ అధ్యక్షుడు





కొత్త మంత్రులు శ్రీహరి, లక్ష్మణ్‌కుమార్‌తో శ్రీహరి

నిర్మల్‌చైన్‌గేట్: నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక న్యాయం అమలు కోసం పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కృషి చేస్తున్నారన్నారు.

కందకాల తవ్వకం ఆపాలి



నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో కందకాల తవ్వకం ఆపాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న కోరారు. ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.రాజన్న మాట్లాడుతూ సారంగాపూర్ మండలం జౌలి గ్రామంలో 50 ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు కందకాలు తవ్వి వారిని తరిమేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రామలక్ష్మణ్, సాయినాథ్, సుదర్శన్, గంగాధర్ పాల్గొన్నారు.

గోడు చెప్పుకున్నా.. గోస తీరడం లేదు!

• ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం
• కలెక్టరేట్ చుట్టూ బాధితుల ప్రదక్షిణ
• సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి..
• దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కన్నీటితో వేడుకున్నా.. తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు లేక అవస్థలు పడుతున్నామని పార్ట్ టైం సిబ్బంది, వితంతు, దివ్యాంగ పింఛన్ రావడం లేదని, కాల్వ కింద భూమి పోతే నష్టపరిహారం రాకుండా అడ్డుకున్నారని ఇలా పలు సమస్యలతో సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు వినతులు సమర్పించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 73 అర్జీలు వచ్చాయి. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఏవో సూర్యారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సమన్వయంతో పనిచేయాలి

ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్‌ను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. స్కూళ్లు, హాస్టళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేసి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

అక్రమ పట్టా తొలగించాలి




నాకు కుంటాల మండలంలో 1.2 ఎకరాల భూమి ఉంది. మా తమ్ముడు నాకు తెలియకుండా ఆ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నడు. ఇప్పుడు నాకు రైతుబంధు కూడా రావడం లేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. అక్రమ పట్టా రద్దు చేయండి.
– జక్కుల గజ్జన్న, కుంటాల

సర్వే నంబర్ మిస్సింగ్



మేము ముగ్గురం అన్నదమ్ములము. మా అన్న పట్టా భూమి అయిన 314/1లో 19 గుంటలు, 408/అ/1 లో 6 గుంటలు ఉంది. ఆ భూమిని నేను 2018 లో కొనుగోలు చేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ఇప్పటికే 20 సార్లు అధికారులకు పిర్యాదు చేశాను. సమస్య పరిష్కరించండి
– కోరిపల్లి రవి, పోస్కల్

భూమి సర్కారుదంటున్నారు..



మాది కుంటాల మండలం అంబకంటి. 220, 324 సర్వే నంబర్లు మా అమ్మ కురుమే భూమి పేరుమీద 5.31 సాగు భూమి 1950 నుంచి 1970 వరకు ఉంది. తర్వాత కాలంలో ఈ భూమి సర్కారుది అంటున్నారు. పదేళ్లుగా తిరుగుతునా న్యాయం జరగడం లేదు. మా అమ్మ పేరు మీద ఉన్న భూమి వారసులమైన మా పేరిట రిజిస్టర్ అయ్యేలా చూడాలి.
– గజ్జరి విట్టల్, అంబకంటి

గోవధశాల తరలించాలి




మేము ఖానాపూర్ పట్టణంలోని శ్రీసాయినగర్, శ్రీరాంనగర్ కాలనీవాసులం. మా కాలనీలో ఉన్న గోవధశాల వలన ఇబ్బంది పడుతున్నాం. వీటి నుంచి వచ్చే వ్యర్థాలను కుక్కలు, పందులు లాక్కొని ఇళ్ల ముందు వేస్తున్నాయి. దుర్వాసన వస్తోంది. అనారోగ్యంపాలవుతున్నాం. గతంలో కూడా అనేకసార్లు అధికారులకు విన్నవించాం. వధశాలను పట్టణ శివారుకు తరలించాలి.
– సాయి నగర్, శ్రీరాంనగర్ కాలనీ వాసులు

హద్దులు చూపించాలి



నాకు వారసత్వంగా సర్వే నంబర్ 167లో విస్తీర్ణం 5.14 ఎకరాల భూమి ఉంది. నా భూమి పక్కన గల 163 సర్వేనంబర్‌లో ఉన్న వారితో కొంత భూతగాదా జరిగింది 2023 డిసెంబర్‌లో, నా భూమి హద్దులు చూపించాలని నేను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పేరు మీద చలానా కట్టాను. అధికారులు వచ్చి భూమి కొలువగా 163 సర్వే నంబర్ నుంచి నాకు కొంత భూమి వస్తుందని తేలింది. నా ప్రత్యర్థి, నేను మరోసారి భూమి కొలవాలని ఏడీకి చలాన్ కట్టాం. నేటికీ సర్వే అధికారులు కచ్చితంగా మా భూమి ఇది అని హద్దులు చూపడం లేదు.
– పల్సీ దేవీదాస్, లింబాకే

డీసీవోపై చర్యలు తీసుకోవాలి



మహమ్మద్ నబీ అనే వ్యక్తి 16 సంవత్సరాల వయస్సు(మైనర్‌గా) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సత్తనపల్లిలో సెప్టెంబర్ 20, 1994లో సబ్ స్టాఫ్‌గా ఉద్యోగంలో చేరాడు. తర్వాత ఇదే వ్యక్తి మహమ్మద్ నబీ, షేక్ నబీ పేర్లతో చలామణి అయి సొసైటీ నుంచి జీతం తీసుకున్నాడు. ఉద్యోగం చేస్తూనే పాత ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 2006లో వార్డు మెంబర్‌గా పోటీ చేశాడు. 2012 వరకు వార్డు మెంబర్ విధులు నిర్వర్తిస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కూడా జీతం తీసుకున్నాడు. ఇప్పుడు అతడిని డీసీవో రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహమ్మద్ నబీపై చర్యలు తీసకుని అతను పొందిన జీతాన్ని రికవరీ చేయాలి.
– బలప్ప రాజన్న, గోదల పంపు

డీ1 పట్టా కేటాయించ వచ్చా..



దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలో అంబాయి వాయికుంట డీ1 పట్టాలో 124 సర్వే నంబర్ లో 2007–2008 లో పూర్తి విస్తీర్ణం 29.16 ఉంది. ప్రస్తుతం లోలం గ్రామస్తుడయిన రాచక మల్లయ్య అంబవాయి కుంట శిఖం భూమి నందు 4.13 విస్తీర్ణంతో 124/2 సరే నంబర్‌తో పట్టా సృష్టించాడు. శిఖం భూమితో డీ1 పట్టా ఇవ్వొచ్చా.
– గంగాపుత్ర సంఘం సభ్యులు, లోలం

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మేము ప్రభుత్వ, ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలుగా విధులు నిర్వహిస్తున్నాం. మా ఔట్‌సోర్సింగ్ ఏజెంట్ కాంట్రాక్ట్ కాలపరిమితి ముగియడంతో మాకు రావలసిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని నెలలుగా జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా పెండింగ్ వేతనాలు విడుదల చేసి.. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ కాలపరిమితి పెంచాలి.
– ఆరోగ్య మిత్రలు

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గన్‌పూర్ వాగు నుంచి ఇసుక లోడ్‌తో జోగాపూర్‌కు వెళ్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకొని మైలారం గ్రామానికి చెందిన డ్రైవర్ ఈగం హరీశ్, జోగాపూర్‌కు చెందిన యజమాని సోండ్ల ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఇసుక లారీల పట్టివేత



పట్టుకున్న ఇసుక లారీలు

తానూరు: భైంసా నుంచి తానూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. భైంసా నుంచి తానూరుకు రెండు లారీల్లో ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో బాలాజీ గుట్ట ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించిన అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి విచారణ అనంతరం తహసీల్దార్‌కు లారీలు అప్పగించనున్నట్లు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

నర్సాపూర్(జి): ఆగి ఉన్న లారీని ఢీకొని దంపతులకు గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల మేరకు.. దిలావర్పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన తోపారం బుచ్చన్న -కళావతి దంపతులు బైక్‌పై ఆదివారం లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామానికి ఓ శుభకార్యానికి వెళ్లారు. నర్సాపూర్ (జి) మండలంలోని నందన్ ఎక్స్ రోడ్డు 61వ జాతీయ రహదారిపై మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేశ్ అనే లారీ డ్రైవర్ రోడ్డుపై ఎలాంటి ఇండికేటర్స్, సూచనలు లేకుండా లారీని నిలిపి ఉంచాడు. బైక్‌పై దంపతులు స్వగ్రామానికి వస్తుండగా రోడ్డుపై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. 108 వాహనంలో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. జైనథ్‌కు చెందిన పోతిపెల్లి ప్రశాంత్ ఆదిలాబాద్‌లోని శ్రీరామ్ కాలనీకి చెందిన కృష్ణమాచారి వద్ద రూ.2లక్షలకు ఉద్యోగం ఇప్పిస్తానని బేరం కుదుర్చుకుని మోసం చేశాడు. ఇదివరకే రూ.లక్ష వసూలు చేయడంతో ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు. బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. నిందితుడిపై ఇదివరకే పలు కేసులు నమోదయ్యాయని తెలిపారు.

విప్లవ వీరుడా.. ఇక సెలవు..!

30 ఏళ్ల ఉద్యమ బాటకు ఇక సెలవు.. నూనూగు మీసాల వయస్సులో పేగు బంధాన్ని తెంచుకుని పోరు బాటలో నడిచి, చివరకు అడవిలో రక్తపు సింధూరమై 30 ఏళ్ల తరువాత స్వగ్రామానికి తిరిగి వచ్చిన అడెల్లు మృతదేహం ఎర్రని వర్షపు తాకిడికి తడిసి ముద్దయింది. కట్టెలో తన మేను కాలినా, అంతిమయాత్రలో పాల్గొన్న అశేష జనాలను చూస్తే ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాడని రుజువైంది.

– బోథ్

- ఎర్రజెండాలతో ఎరుపెక్కిన పొచ్చెర
- స్వగ్రామంలో అడెల్లు అంత్యక్రియలు పూర్తి
- భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రజాసంఘాల నేతలు



భౌతికకాయంపై ఎర్రజెండా కప్పుతున్న విరసం, అమరుల బంధుమిత్ర సభ్యులు



మైలారపు అడెల్లు(ఫైల్)

ఎర్రజెండాలతో అడెల్లు అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, వివిధ సంఘాల నాయకులు

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంత్యక్రియలు సోమవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ఆయన స్వగ్రామం పొచ్చెరలో కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, అభిమానుల మధ్య ముగిశాయి. అడెల్లు అంతిమయాత్రలో గ్రామం ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. ఆదివారం రాత్రి బీజాపూర్ నుంచి పొచ్చెర గ్రామానికి అడెల్లు మృతదేహాన్ని కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. అడెల్లు భౌతికకాయంపై ఎర్రని వస్త్రం ఉంచి నివాళులర్పించారు. సోమవారం ఉదయం బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), సీపీఐ డెమొక్రటిక్, ప్రజాసంఘాల నాయకులు, మాజీ మావోయిస్టులు, అభిమానులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అడెల్లు భౌతికకాయానికి నివాళులర్పించారు. గ్రామంలోని వీధుల గుండా అంతిమయాత్ర నిర్వహించారు. పౌర హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విరసం నేతలు, మాజీ మావోయిస్టులు, కళాకారులు పాటలు, నృత్యాలు చేస్తూ అడెల్లుకు నివాళులర్పించారు. ఎర్రజెండాలు చేతపట్టి, అడెల్లు అమర్‌రహే అంటూ నినాదాలు చేస్తూ అంత్యక్రియలో ముందుకుసాగారు. 'ఆదివాసీలదే అడవి, కగార్ ఆపరేషన్ ఆపివేయాలని' ప్లకార్డులు పట్టుకుని అంతిమయాత్ర నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర 3 గంటలకు ముగిసింది. దాదాపు నాలుగున్నర గంటల పాటు అంతిమయాత్ర కొనసాగింది. ప్రజా సంఘాల నేతలు సైతం కన్నీరుమున్నీరయ్యారు. మాజీ మావోయిస్టులు ఉద్యమంలో అడెల్లుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని విలపించారు. కాగా గ్రామంలోని వైకుంఠధామం వద్ద అడెల్లుకు అంత్యక్రియలు నిర్వహించారు. అడెల్లు అన్న పెద్ద అడెల్లు దహన సంస్కారం నిర్వహించారు.

'చంపే హక్కు ఎవరికీ లేదు'..

అడెల్లు భౌతికకాయం వద్ద పౌర హక్కుల నాయకులు, అమరుల బంధు,మిత్ర సభ్యులు, మానవహక్కుల వేదిక నాయకులు, విప్లవ రచయిత సంఘం (విరసం) నేతలు మాట్లాడారు. ఒక మనిషిని చంపే హక్కు రాజ్యాంగం కల్పించలేదని, అలాంటిది రాజ్యాంగాన్ని విస్మరిస్తూ మావోయిస్టులను పిట్టల్లా చంపుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజల గొంతుకగా ప్రశ్నిస్తే వారిని చంపుతారా అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావ్ అన్నారు. అడెల్లును పట్టుకుని, విషంతో కూడిన ఆహారం తినిపించి చెట్టుకు కట్టి కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ ఆరోపించారు.

మఫ్టీలో పోలీసులు..

అడెల్లు అంత్యక్రియల్లో పోలీసులు మఫ్టీలో ఉండి నిఘా వేశారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం అంత్యక్రియలు ముగిసే వరకు కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించారు.

ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయి : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అడెల్లు పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మైలారపు అడెల్లు భౌతికకాయానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడెల్లు సొంత లాభం కోసం పనిచేయలేదని, పేద ప్రజల కోసమే చిన్న వయస్సులోనే ఉద్యమంలోకి వెళ్లాడన్నారు. 30 ఏళ్ల పాటు ఉద్యమంలో ఉండి పేద ప్రజల పక్షాన నిలబడ్డాడని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కగార్ పేరుతో చేపట్టిన ఎన్‌కౌంటర్‌లు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. ఇవి ఎన్‌కౌంటర్‌లు కావని పట్టుకొచ్చి కాల్చి చంపడమని ఆరోపించారు. అడెల్లు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా అంత్యక్రియలకు రూ.10 వేలు అందించారు.

పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలో ఉత్తమ ప్రతిభ



ఉప్పల శ్రీనివాస్

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఉప్పల శ్రీనివాస్ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో వృక్షశాస్త్ర విభాగంలో 100 మార్కులకు 85 మార్కులు పొంది యూనివర్సిటీస్థాయి తొలి ర్యాంకు సాధించడం గమనార్హం. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆయన గతేడాది గురుకుల విద్యాసంస్థల్లో నిర్వహించిన నియామక పరీక్షల్లో బొటనీ సబ్జెక్టులో డిగ్రీ అధ్యాపకుడిగా ఉద్యోగం పొందారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న ఆదిలాబాద్, మెదక్ జట్లు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. తొలిరోజు ఆదిలాబాద్ జట్టు శుభారంభం చేసింది. మెదక్ జిల్లా జట్టుపై 4–0 తేడాతో సత్తా చాటింది. సాయంత్రం సమయంలో పోటీలకు ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరు కావాల్సి ఉండగా ఎంపీ హాజరయ్యారు. కలెక్టర్, ఎస్పీ హాజరయ్యేలోపే భారీ గాలిదుమారంతో స్టేడియం పరిసరాలు దుమ్ముతో నిండిపోయాయి. ఎంపీ నగేశ్ స్టేజ్ వద్దే ఉండడంతో నిర్వాహకులు హుటాహుటిన ఆయనను వాహనంలో అక్కడి నుంచి తరలించారు. దీంతో సాయంత్రం ఆట కొనసాగలేదు. ప్రారంభ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కాంగ్రెస్ నాయకుడు లోక ప్రవీణ్ రెడ్డి, శిక్షకులు అతుల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లి.. అదృశ్యం

- గల్ఫ్‌దేశంలో నిర్మల్ జిల్లావాసి జాడ కరువు
- ఆందోళనలో కుటుంబసభ్యులు
- ఇండియాకు రప్పించాలని వినతి



స్వదేశ్‌తో బాధిత కుటుంబసభ్యులు

నిర్మల్‌ఖిల్లా: పొట్టకూటి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన జిల్లాకు చెందిన ఓ కార్మికుడి ఆచూకీ తెలియక అతడి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన పన్నాల శ్రీనివాస్(40) గత 16 సంవత్సరాలుగా సౌదీ అరేబియాలో తోటమాలిగా పనిచేస్తున్నాడు. ప్రతీ రెండూ, మూడేళ్లకొకసారి ఇంటికి వస్తూ పోతుండేవాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. తాజాగా ఎనిమిది నెలల క్రితం ఇంటికి తిరిగి వచ్చిన శ్రీనివాస్ ఇక ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే సౌదీ అరేబియాలోని తన యజమాని వచ్చి పనిలో చేరాలని కోరగా గత మే నెలలో మళ్లీ వెళ్లాడు. అక్కడ యజమాని ఇంట్లో రెండు రోజులు ఉన్న అనంతరం వ్యవసాయ క్షేత్రానికి పంపగా అక్కడి నుంచి తన భార్యాపిల్లలకు ఫోన్ చేసి క్షేమ సమాచారం అందించాడు. అనంతరం అతని నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అక్కడి యజమానికి ఫోన్ చేయగా స్పందించలేదని, శ్రీనివాస్ క్షేమసమాచారంపై తమకు ఆందోళనగా ఉందని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో శ్రీనివాస్ తల్లి గంగవ్వ, భార్య మమత, ముగ్గురు పిల్లలు వాపోయారు. సౌదీ అరేబియా నుంచి స్వస్థలానికి రప్పించే ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. అనంతరం రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి పూర్తి వివరాలు అందజేశారు. అక్కడి ఎంబసీతో మాట్లాడి శ్రీనివాస్ ఆచూకీ గుర్తించే ప్రయత్నం చేస్తామని కుటుంబసభ్యులకు ఆయన భరోసానిచ్చారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే రెండు రోజుల క్రికెట్‌లీగ్ పోటీల కోసం ఉమ్మడి జిల్లా నుంచి క్రికెట్ జట్టు ఎంపిక చేసినట్లు హెడ్‌కోచ్ పి.ప్రదీప్, సెలెక్టర్లు గోదావర్తి సుధీర్, చందు, పత్తి తిరుపతి, బి.రాకేశ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 90 మంది క్రీడాకారులు రాగా, వారిని ఆరు జట్లుగా విభజించి, ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. అందులో ప్రతిభ కనబర్చిన వారిని అండర్ 25 ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో మంచిర్యాలకు చెందిన సాయికృష్ణారెడ్డి, ఐ. సందీప్, ఇజాన్ అవాజ్, అశ్రిత్, ఎండీ జాంషెడ్, చరణ్, ఆసిఫాబాద్ నుంచి ఏ.సంతోష్, మందమర్రి నుంచి సింహాద్రి, రామ్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్, సాయి వర్మ, వేంపల్లి నుంచి సాత్విక్ పటేల్, నిర్మల్ నుంచి వినయ్, ఆదిలాబాద్ నుంచి శ్రీచరణ్, చందన్, దర్శ్ అగర్వాల్, ముసాదిక్, రాజబాబు, గుడిపేట్ నుంచి జే. సంతోష్, బెల్లంపల్లి నుంచి సుభాష్ చంద్రబోస్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

'సాక్షి'పై దాడులు అమానుషం



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డెస్క్ జర్నలిస్టులు

కరీంనగర్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్, ఆంధ్రప్రదేశ్‌లోని 'సాక్షి' కార్యాలయాలపై దుండగుల దాడిని ఖండిస్తూ సోమవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని సాక్షి యూనిట్ ఆఫీస్ వద్ద జర్నలిస్టులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మీడియా స్వేచ్ఛను కాలరాస్తూ అణచివేయాలని చూడడం దారుణమన్నారు. నిరసనలో యూనిట్ మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జీలు ముజఫర్, గుర్రాల మహేశ్, డెస్క్ జర్నలిస్టులు బొగ్గుల సంతోష్, ములుకుంట్ల కనకేశ్వర్, మామిండ్ల బాలనర్సయ్య, డి.రాజశేఖర్, పోలు సంపత్, దూట వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరితవనం పార్కులో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దాత్రక్ సంజీవిత, ఆమె భర్త కమలేశ్వర్లు మావల హరితవనం పార్కులో ఉండగా వారిని బెదిరించి దాడిచేసి మావలకు చెందిన సంతోష్, పల్లపు దుర్గయ్యలు నగదు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను విద్యానగర్ బస్టాండ్ ప్రాంతంలో పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారని సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిద్దరిని 15 రోజుల పాటు జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజా స్థలాలు, పార్కులు, ప్రైవేట్ ప్రదేశాల్లో వాహనాలను అడ్డగించి డబ్బులు దోచే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై రౌడీ షీట్లు తెరిచి నిఘా పెడతామన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



చంద్రకాంత్ మృతదేహం

భైంసాటౌన్: పట్టణంలోని గీతా కాటన్ ఇండస్ట్రీస్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ దేశ్‌ముఖ్ అనే వ్యక్తి సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కుబీర్ మండలం వర్నికి చెందిన చంద్రకాంత్ కొన్నేళ్లుగా రాహుల్‌నగర్‌లో ఉంటూ, గీతా కాటన్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఫ్యాక్టరీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై పట్టణ సీఐ జి.గోపినాథ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో నమోదైన 14 కేసుల్లో పట్టుబడ్డ 77 కిలోల 781 గ్రాముల గంజాయిని దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్ వద్ద గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, డీసీఆర్బీ ఎస్సై హకీమ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అధికారుల నిలదీత



రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో సోమవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రెవెన్యూ అధికారులను గ్రామానికి చెందిన కొందరు సమస్యలపై నిలదీశారు. గ్రామానికి చెందిన ఎండీ రశీద్‌ఖాన్ డీఎస్ పెండింగ్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజెక్ట్ చేయడంతో సమస్య పరిష్కారం కాలేదని, సదస్సుకు హాజరైన డీటీ మాధవి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు లావణ్య, ప్రవీణ్‌లను ప్రశ్నించారు. అధికారులు కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతికూలంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. రశీద్‌ఖాన్‌తో పాటు నర్సయ్య అనే మరో రైతు సైతం అధికారులను తన సమస్యపై ప్రశ్నించాడు. మండలంలో ఎక్కడా లేని విధంగా ఒక్క తాళ్లపేటలోనే భూ సమస్యలపై 57, సాదాబైనామాలకు సంబంధించి 79 దరఖాస్తులు వచ్చాయి.

నకిలీ విత్తనాలు విక్రయించే వ్యక్తిపై కేసు



తనిఖీలు చేస్తున్న అధికారులు, పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలోని బెల్లూరి శివారు ప్రాంతంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న గోలి మనోజ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దుకాణంలో తనిఖీలు చేశారు. షాపులో రెండు నకిలీ విత్తన ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఎలాంటి అనుమతి లేకుండా 227 ప్యాకెట్లను నిల్వ ఉంచాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేశారు. ఏవో నగేశ్ రెడ్డి, ఆర్ఐ నారాయణలు ఉన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

నేరడిగొండ: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన లక్ష్మణ్ (32) మద్యానికి బానిసై సోమవారం మండలంలోని చించోలి గ్రామ సమీపంలో గల వాగులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది నుంచి లక్ష్మణ్ తాగుడికి బానిసై దొంగతనాలు చేసే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఆదివారం తన పక్కింట్లో 11 గ్రాముల బంగారం దొంగలిస్తూ పట్టుబడడంతో పంచాయతీ నిర్వహించి గ్రామపెద్దలు మందలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

లారీలో అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



పశువులను పరిశీలిస్తున్న ఎస్సై శ్వేత, వెటర్నరీ డాక్టర్ రాకేశ్ శర్మ

భీమారం: మహారాష్ట్ర నుంచి లారీలో అక్రమంగా తరలిస్తున్న 35 పశువులను సోమవారం భీమారం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున పశువులను లారీల్లో తరలిస్తున్నారనే సమాచారం మేరకు భీమారంలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపగా లారీ డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. పారిపోతున్న డ్రైవర్‌ను వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా ఎద్దులను మహారాష్ట్ర నుంచి జగిత్యాల జిల్లా రాజరాంపల్లికి తరలిస్తున్నామని తెలిపాడు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ రుక్సాకా, యజమాని పంకజ్ గోపాల్ సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పశువులను చెన్నూరు పట్టణం సమీపంలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా వెటర్నరీ వైద్యుడు రాకేశ్ శర్మ పశువులకు పరీక్షలు నిర్వహించారు.

దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురి రిమాండ్



నిందితులు, వాహనంతో ఎస్సై

ఆదిలాబాద్‌రూరల్: దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలు అనే వ్యక్తి బంగారుగూడకు చెందిన షేక్ ముజ్జు అనే వడ్డీ వ్యాపారి దగ్గర డబ్బులు తీసుకున్నాడు. ఈక్రమంలో అధిక వడ్డీ కోసం ఆదివారం ఆయన ఇంటికి షేక్ సలీమ్, షేక్ సమీర్‌లతో వెళ్లి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఆయన వద్ద నుంచి రూ.2వేల నగదు లాక్కున్నారు. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025 –26 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతి ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా యువజన క్రీడల ఇన్‌చార్జి అధికారి గుర్రాల హనుమంత రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందని, 16 జూన్ నుంచి 19 జూన్ వరకు మండలస్థాయి ఎంపిక, అక్కడ ఎంపికైన విద్యార్థులకు 23 నుంచి 26 వరకు మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జూలై 1వ తేదీ నుంచి జూలై 5 వరకు ఎంపిక ఉంటుందని తెలిపారు. ఒక్కో క్రీడా పాఠశాలలో బాలబాలికలకు 20 సీట్లు చొప్పున మూడు పాఠశాలల్లో మొత్తం 120 సీట్లు ఉన్నాయని తెలిపారు. 1 సెప్టెంబర్ 2016 నుంచి 30 ఆగస్టు 2017ల మధ్య జన్మించిన వారు ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో https:// tgss. telangana. gov. in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు బాక్సింగ్ కోచ్ సీహెచ్. రాజేశ్ 9963539234 లో సంప్రదించాలన్నారు.